ఉత్సవాలకు ముస్తాబవుతున్న రాజంపేట

- ఈ యేడు వైభవంగా అమ్మవారిశాలలో శరన్నవరాత్రి వేడుకలు
- ముమ్మరంగా సాగుతున్న అలంకరణ పనులు
- 22 నుంచి వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనం



గర్భగుడిలో కొలువైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి మూలవిరాట్



అమ్మవారిశాల ముఖద్వారం వద్ద ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సెట్టింగ్



పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద చూపరులను ఆకట్టుకునేలా భారీ సెట్టింగ్

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తరువాత రాజంపేటలో దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. రాజంపేట పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలు ఏడాదికేడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆర్యవైశ్యులు దసరా ఉత్సవాలను భారీగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పదిరోజుల పాటు నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారిశాలకు తరలి వచ్చి ప్రత్యేక అలంకరణలో కొలువుదీరే కన్యకాంబను దర్శించుకుంటారు. అందువల్ల భక్తులకు కనువిందు చేసేలా ఈ ఏడాది కూడా అమ్మవారిశాల పరిసర ప్రాంతాల్లోనే కాక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారి ప్రతిమలను విద్యుద్దీపాలతో ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారిశాలలోకి ప్రవేశించే మార్గాల్లో భారీ సెట్టింగ్‌లతో అలంకరణలు చేస్తున్నారు.

ఉత్సవాలకు 135 ఏళ్ల చరిత్ర

రాజంపేటలోని అమ్మవారిశాలను 1890వ సంవత్సరంలో నిర్మించారు. అప్పటి నుంచి దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యులు చెబుతున్నారు. ఇక్కడి దసరా ఉత్సవాలకు 135 సంవత్సరాల చరిత్ర ఉండటం విశేషం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మవారిశాలలోని గర్భగుడి రథం ఆకారంలో ఉండటం ఇక్కడి ప్రత్యేకత. రథం ఆకారంలో ఉన్న గర్భగుడిలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి మూలవిరాట్ భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిస్తుంది.

22 నుంచి ప్రారంభం

ఈనెల 22వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా తొలిరోజు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దీక్షాబంధనదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. అలాగే 23వ తేదీ బిల్వవృక్ష నివాసినిగా, 24వ తేదీ అన్నపూర్ణాదేవి అలంకారంలో, 25వ తేదీ కృష్ణమూర్తి రూపంలో, 26 తేదీ మోహినిదేవిగా, 27వ తేదీ మీనాక్షి అమ్మవారిగా, 28వ తేదీ గాయత్రీదేవిగా, 29వ తేదీ సరస్వతీదేవి రూపంలో, 30వ తేదీ మహిషాసుర మర్దినిదేవి అలంకారంలో, అక్టోబర్ 1వ తేదీ మహాలక్ష్మీదేవిగా, అక్టోబర్ 2వ తేదీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో, 3వ తేదీ ఊంజలిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించనున్నారు.

29న బిందెసేవ గ్రామోత్సవం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో బిందెసేవ గ్రామోత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఏడాది బిందెసేవ గ్రామోత్సవాన్ని ఈనెల 29వ తేదీ ఆర్యవైశ్యులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. బిందెసేవను ఆర్యవైశ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అలాగే ప్రతి ఇంటి నుంచి ఒకరైనా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. బిందెసేవ గ్రామోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించనున్న సాంస్కృతిక ప్రదర్శనలు, విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బిందెసేవ సందర్భంగా ప్రతి ఏడాది ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించేందుకు పట్టణ ప్రజలే కాక వివిధ గ్రామాల ప్రజలు కూడా పెద్దఎత్తున పాల్గొని తిలకిస్తుండటం విశేషంగా చెప్పవచ్చు. ఈ ఏడాది బిందెసేవ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ప్రతి రోజు రాత్రి గాంధీ సర్కిల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా టీవీ, సినీ కళాకారులతో కూడా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలను ఉర్రూతలూగించే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను ఇప్పించనున్నారు.

అత్యంత వైభవంగా ఉత్సవాలు



రాజంపేటలో తొలి నుంచి దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఇక్కడ జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేకతను కూడా సంతరించుకున్నాయి. తాను మూడుమార్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి సేవ చేసుకునే భాగ్యం కలగడం తన పూర్వ జన్మసుకృతం. ఈ సంవత్సరం సంఘ సభ్యుల సహకారంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– గ్రంధే సత్యనారాయణ గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, రాజంపేట

ప్రజలు అప్రమత్తంగా వుండాలి



దసరా అంటేనే సందడైన పండుగ. అమ్మవారి భక్తులంతా ఎంతో సంతోషంతో ఆలయాలకు వెళుతుంటారు. భక్తులంతా అమ్మవార్లను మనసారా దర్శించుకోవాలన్న ధ్యాసలోనే ఉంటారు. అదే సమయంలో బంగారు నగలు, నగదు వంటివి చోరీ జరిగే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల ఆలయాలకు వెళ్లే భక్తులు, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. దసరా సందర్భంగా ఏఎస్పీ నేతృత్వంలో ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

– బి.నాగార్జున, అర్బన్ సీఐ, రాజంపేట

ప్రాంతీయ వైద్యశాల సమస్యలు పరిష్కరించాలి




సూపరింటెండెంట్ డా.పీపీఎస్‌రాజుతో సమావేశమైన వామపక్ష నేతలు

రాజంపేట : కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో సమస్యలు పట్టిపీడిస్తున్నాయని కమ్యూనిస్టు నాయకులు మండిపడ్డారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవికుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి సికిందర్‌లు ప్రాంతీయ వైద్యశాలను సందర్శించారు. అలానే రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరాతీశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ వైద్యులు, అంబులెన్స్ కొరత కారణంగా ప్రమాద కేసులు, అత్యవసర కేసులు తిరుపతి, కడపకు తరలిస్తున్నారన్నారు. ప్రత్యేక విభాగాల వైద్యుల కొరత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కంటి, ఆర్థో, జనరల్ సర్జన్ వంటి కీలక విభాగాలలో వైద్యులు అందుబాటులో లేరన్నారు. వైద్య పరికరాల లేమి వెంటాడుతోందన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని కోరారు. గర్భిణులకు సరైన వసతి కల్పించాలని కోరారు. ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డా.పీపీఎస్‌రాజుతో సమావేశమై సమస్యలు తెలియజేసి పరిష్కరించాలన్నారు. పదిరోజులలోపు అన్ని అంశాలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని వామపక్ష నేతలకు సూపరింటెండెంట్ సమాధానమిచ్చినట్టు సీపీఐ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, రమణ, పెంచలయ్య, సీపీఎం నాయకులు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెన్నపేరూరు, తప్పెటవారిపల్లి గ్రామాల సోమశిల వెనుక జలాల ముంపు వాసులు అప్రమత్తంగా ఉండాలని ఒంటిమిట్ట మండల తహసీల్దార్ దామోదర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. పై తట్టు ప్రాంతాల్లో వర్షాలు బాగా కురవడంతో సోమశిల జలాశయానికి వరద నీరు భారీగా వస్తోందన్నారు. సోమశిల వెనుక జలాలు పెరిగి, ముంపు ప్రాంతాలను ముంచేస్తున్నాయని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ గ్రామంలోకి వెనుక జలాలు వచ్చి చేరితే, పునరావాసానికి పెన్నపేరూరు సచివాలయంలో తలదాచుకోవాలని కోరారు. గ్రామాలలోని పొలాల్లోకి వెనుక జలాలు భారీగా వచ్చి చేరినందున విష సర్పాలు, తేళ్లు వచ్చే ప్రమాదం ఉందని, వాటి నుంచి జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే చరవాణి సహాయంతో తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్ రెడ్డి, వీఆర్ఓ అంజి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సదరం' కోసం పడిగాపులు



సదరం కోసం వేచివున్న దివ్యాంగులు

రాజంపేట : రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో సోమవారం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందేందుకు పడిగాపులు పడ్డారు. షెడ్యూల్ ప్రకారం సదరం క్యాంప్ లేకపోవడంతో సకాలంలో ఆర్థో వైద్యుడు రాకపోవడం దివ్యాంగులు ఇక్కట్లను ఎదుర్కొన్నారు. 11:30 గంటల వరకు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. ఈ సమస్యను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పీపీఎస్ రాజు గుర్తించి, సకాలంలో స్పందించారు. షెడ్యూల్ ప్రకారం లేకపోవడం, రెండు నెలల ముందే సదరానికి దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోవడం వల్ల ఆసుపత్రి చేరుకున్నారు. అయితే సూపరింటెండెంట్ దివ్యాంగుల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేకంగా ఆర్థోపెడిక్ వైద్యుడుని పిలిపించి సదరం నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. 30 మందికి సదరం క్యాంపులో పరీక్షలు చేయడం జరిగిందని సూపరింటెండెంట్ తెలియజేశారు.

పేదలకు వైద్యవిద్య దూరం చేసే కుట్ర

రాయచోటి టౌన్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలో అప్పజెప్పడం చూస్తుంటే.. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా చంద్రబాబు నాయుడు తీరు ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ ధ్వజమెత్తారు. సోమవారం రాయచోటి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు. అలాగే ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలని ఆరోగ్యశ్రీని పరిధిని రూ.25 లక్షలకు పెంచి ఆరోగ్యభద్రత కల్పించారని తెలిపారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం పేదవాడికి వైద్యం అందకుండా చేయడంతోపాటు విద్యను దూరం చేయాలనే కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కళాశాలలు పెట్టుకోవడానికి ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చిందని, ఎవరైనా మెడికల్ కళాశాలలు పెట్టుకోవచ్చని చెప్పిందేగాని ఇలా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేట్ వారికి అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శివశంకర్ యాదవ్, బుజ్జి బాబు, నవాజ్ (క్రిష్) యూసూఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

పందుల కారణంగా ప్రబలుతున్న జ్వరాలు



మండల కేంద్రంలో వడ్ల మిషన్ వద్ద స్వైర విహారం చేస్తున్న పందులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో పందుల కారణంగా అపరిశుభ్రం ప్రబలి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. కొంతమంది బయట నుంచి గ్రామంలోకి పందులను తీసుకువచ్చి వదలుతుండటంతో వాటి సంతతి పెరిగిపోయి గ్రామంలో ప్రధాన రహదారులు, తాగునీటి మోటార్లు, ఇళ్ల వద్ద వర్షపునీరు నిల్వ ఉండటంతో వాటిలో దొర్లి అపరిశుభ్రం చేస్తున్నాయి.

దీంతో దోమలు ప్రబలి విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పందులను తీసుకెళ్లాలని పలుమార్లు గ్రామస్తులు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో అపరిశుభ్రం చేస్తున్న పందులను ఇక్కడి నుంచి తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కాలభైరవుడికి పూజలు



రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె భైరవ గుట్టపై వెలసిన శ్రీ కాల భైరవుడికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం పూలు, ఆభరణాలతో అలంకరించారు. తరువాత భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి దర్శించిన భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి సభ్యుడు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కృష్ణానగర్ దశాబ్దాల రోడ్డు ఆక్రమణ

సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు

రాజంపేట : పట్టణంలో కృష్ణానగర్‌లో సర్వేనెంబరు 640లో దశాబ్దాలుగా ఉన్న రోడ్డు ఆక్రమణకు అధికార పార్టీ అండతో కొందరు పాల్పడటం వివాదాస్పదంగా మారింది. దీంతో సోమవారం స్థానికులు సబ్‌కలెక్టర్ భావనకు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబరు 824లో ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొని 640 కూడా తమదే అంటూ దౌర్జన్యంగా వ్యవహరించిన తీరుతెన్నులను సబ్‌కలెక్టర్‌కు వివరించారు. పది అడుగుల రోడ్డు అందరిదని డాక్యుమెంట్‌లో ఉందని, అయినప్పటికీ దౌర్జన్యంగా వ్యవహరిస్తూ రోడ్డు లేకుండా బంద్‌చేస్తే తమ పరిస్థితి ఏమిటి అని పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. మరోవైపు ఎలాంటి అనుమతులు లేకుండానే కృష్ణానగర్‌లో చెట్లను నరికి వేయడంపై అటవీశాఖ అధికారులు స్పందించారు. అక్కడ పనిచేస్తున్న యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై స్పందించిన సబ్‌కలెక్టర్ భావన విచారించాలని రాజంపేట తహసీల్దారును ఆదేశించారు.

క్లిక్ చేసే ముందు కాస్త ఆలోచించండి

రాయచోటి టౌన్ : సెల్ ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేసే ముందు కాస్త ఆలోచించాలని శ్రీ చందన ఒకేషనల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆ కళాశాలలో గ్లోబల్ ఫౌండేషన్ ఆఫ్ గుడ్ సైబర్స్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్, డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు ఏదైనా తెలియని నెంబర్ నుంచి మెసేజ్ వస్తే వెంటనే క్లిక్ చేయకూడదని సూచించారు. అనంతరం సంస్థ ఫీల్డ్ ఇంప్లిమెంటరీ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నేటితరం యువత, విద్యార్థులు ఎక్కువగా చెడుమార్గాలను ఎంచుకోకూడదన్నారు. డిజిటల్ లావాదేవీలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు.

'మోక్షగుండం' ప్రతి విద్యార్థికి ఆదర్శం

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో సోమవారం ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్లుగా విశేష సేవలందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జున, డీఈ రామసుబ్బారెడ్డి, డీన్ సుబ్బారావు, డా.పీవీ సంజీవకుమార్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.నారాయణ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రణాళికబద్ధత, క్రమశిక్షణ, విజ్ఞానం, ప్రతి విద్యార్థికి ఆదర్శమన్నారు. అనంతరం ఇంజనీరింగ్‌లో ప్రతిభ చూపిన అధ్యాపకులకు ప్రత్యేక పురస్కారాలను అందించారు.

పరిహారం ఇవ్వకుండానే ఇచ్చామంటే ఎలా?

సిద్దవటం : తమకు పరిహారం చెల్లించకుండానే చెల్లించినట్టు చూపడం వల్ల తాము ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందుకోలేకున్నామని ఉద్దిమడుగు ముంపు బాధితులు తహసీల్దార్ ఎదుట మొరపెట్టుకున్నారు. సోమవారం వారు రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరై తమ సమస్యను తహసీల్దార్‌కు విన్నవించారు. వారు మాట్లాడుతూ అధికారుల తప్పిదం వల్ల తాము అవస్థలు ఎదుర్కొంటున్నామని, రూపాయి నష్టపరిహారం ఇవ్వకుండానే ఇచ్చినట్టు చూపించారని తమకు న్యాయం చేయాలని వారు ఆవేదనను తెలియజేశారు. అలానే నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా సర్వే నెంబరు 349/1ఏలో రేకుల షెడ్డు ఉన్నా నష్టపరిహారం చెల్లింపులో షెడ్డు లేనట్లుగా చూపించడంపై రైతు నరసింహారెడ్డి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ ఆకుల తిరుమలబాబు కడప ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించాలని చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలియజేశారు.

'జాతీయ భాషను నేర్చుకోవాలి'

నందలూరు : రాజ్యాంగం ఆమోదించిన భాషలలో కెల్లా హిందీ అత్యున్నమైనదని, జాతీయ భాషను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పాటూరులో హిందీ ఉపాధ్యాయులు షఫీవుల్లా ఆధ్వర్యంలో హిందీ భాష దినోత్సవం సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం వల్ల భారతదేశంలోనే కాక ఇతర దేశాలలో కూడా ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలియజేశారు.

మలేరియా ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

గాలివీడు : మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని చీమల చెరువుపల్లి గ్రామం కొప్పలవాండ్ల పల్లెలో నూలివీడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించి చికిత్స అవసరమైన వారిని పీహెచ్‌సీకి తరలించారు. ల్యాబ్ టెక్నీషియన్లు శివ మధుసూదన్ బృందం జ్వరపీడితులకు రక్త నమూనాలు సేకరించి డీఎంఓ సూచనల మేరకు కడప రిమ్స్ మైక్రోబయాలజీ విభాగానికి పంపించినట్టు సిబ్బంది తెలియజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే ప్రాముఖ్యతను వివరిస్తూ పైరిత్రిమ్ స్ప్రెయింగ్ చేయించి, ప్రజలు దోమతెరలు వాడే విధంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, వైద్య సిబ్బంది అహమ్మద్, సాయి చందన, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సర్వీస్ టీచర్లకు టెట్ నిర్వహణ సరికాదు

రాయచోటి జగదాంబసెంటర్ : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించడం సరికాదని ఆపస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన ప్రకారం సేవలో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేసిన నిర్ణయం కారణంగా లక్షలాది మంది ఉపాధ్యాయుల భవిష్యత్, జీవనోపాధి అనిశ్చితిలో పడిందన్నారు. ప్రధానమంత్రి తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఈ వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై పోరాడుదాం

రాయచోటి టౌన్ : రైతుల సమస్యలపై పోరాటం సాగిద్దామని రాష్ట్ర కిసాన్ ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఆయనతో పాటు కిసాన్ విభాగం జిల్లా అధ్యక్షులు దుగ్గనపల్లె సురేంద్రారెడ్డి, నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే రైతులకు న్యాయం జరిగిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఆయన తరువాత రైతులను ఎవరూ పట్టించుకోలేదన్నారు.

మట్టి రవాణాకు అనుమతులుండాలి

ఓబులవారిపల్లె : మండలంలోని చెరువుల్లో మట్టిని తరలించాలంటే అనుమతులు తప్పనిసరని తహసీల్దార్ యామినీ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్, రాజంపేట సబ్ కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని కుంటలు, చెరువులలో సెలవు దినాల్లో అక్రమంగా మట్టి తరలింపునకు అడుకునేందుకు పహారా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇరిగేషన్ అధికారుల అనుమతులు తీసుకున్న తరువాత తమకు సమాచారం ఇచ్చి మట్టి తోలుకోవాలన్నారు. ఎక్కడైనా అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే ప్రజలు వెంటనే తమ దృష్టికి లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున రెడ్డి దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. మట్టి అక్రమ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ప్రారంభమైన క్రీడా పోటీలు

పుల్లంపేట : మండలంలోని కొత్తపేట ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలను మండల విద్యాశాఖాధికారులు ప్రారంభించినట్టు ప్రధానోపాధ్యాయులు అలీబకార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 220 మంది క్రీడాకారులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలలో పాల్గొనట్టు చెప్పారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయిలో ఆడుతారని తెలియజేశారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సాయిరాం, కనకదుర్గ, బాలశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పుల్లంపేట : మండల వ్యవసాయ అధికారిగా (అదనపు బాధ్యతలు) ప్రవీణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇటీవల మండలంలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సాగుకు సంబంధించిన ఇబ్బందులను పరిష్కరించడమే కాక పథకాలు అందేలా కృషి చేస్తానని తెలియజేశారు.

కేజీబీవీ టీచర్లను ఆదుకోవాలి

పుల్లంపేట : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు సోమవారం కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. గతంలో టైం స్కేల్ జీతం జీఓ విడుదలైనా ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీయూ నాయకులు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయుల డిమాండ్ న్యాయమైందని వారి సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వల్లూరు సిద్దయ్య, జిల్లా కౌన్సిలర్ డి.హరినాథ్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ర్యాలీ

సిద్దవటం : మండల కేంద్రంలోని పాత డ్వాక్రా భవనం నుంచి బ్రాహ్మణ వీధి, బస్టాండ్ కూడలి వరకు సోమవారం డ్వాక్రా సంఘ సభ్యులు మన డబ్బులు, మన లెక్కలపై అవగాహన ర్యాలీ నిర్వహించామని వెలుగు ఏపీఎం సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం సుజాత మాట్లాడుతూ ఎండీఎంఎల్ యాప్ ప్రారంభోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘం సభ్యులకు అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. యాప్ ఉపయోగాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణి రాజకుమారి, డ్వాక్రా సీసీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కుల ధృవీకరణ జాబితాను పూర్తి చేయండి

పెనగలూరు : మండలంలో పెండింగ్‌లో ఉన్న కుల ధృవీకరణ జాబితాను పూర్తి చేయాలని తహసీల్దార్ అమరేశ్వరీ ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 8 వేల మంది ఇంతవరకు ఎలాంటి కుల ధృవీకరణ పత్రాలు తీసుకోలేదని వారు తెలియజేశారు. ఈ జాబితాను పంచాయతీలు వారీగా ప్రతి వీఆర్ఓకు అందించడం జరిగిందన్నారు. ఆయా పంచాయతీలలో వీఆర్ఓలు ఇచ్చిన జాబితా ప్రకారం ఆ వ్యక్తి ఏ కులానికి చెందిన వాడో ధృవీకరించి ఆన్‌లైన్ చేయాలని ఆమె తెలిపారు.

వెలుగుపల్లిలో వైద్య శిబిరం

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో జ్వరాలు సోకినట్లు సమాచారం తో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని పి.కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులకు జ్వరాలు తగ్గేంతవరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందని ఆందోళన చెందవద్దన్నారు.

ఆరు హామీలను అమలు చేయలేని మూడు పార్టీలు

రాజంపేట రూరల్ : మూడు పార్టీలు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసేందుకు ఆపసోపాలు పడుతున్నాయని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మిర్యాల సురేఖ దుయ్యబట్టారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ ఎన్నికల అనంతరం మారిపోవడంతో ప్రజలు అవాక్కవుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తయినా ఇప్పటికి ఒక్క కొత్త రేషన్ కార్డు, కొత్త పింఛన్‌ను మంజూరు చేయలేదని చెప్పారు. గెలుపు కోసం అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా హామీలిచ్చిన చంద్రబాబు, ఇప్పుడు నిరుద్యోగులు, మహిళలు, దివ్యాంగులు, రైతులు, కార్మికులు, విద్యార్థులు ఇలా వర్గాల వారికి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు.

గాలికుంటు టీకాల పంపిణీ

రాజంపేట రూరల్/సుండుపల్లె/పెనగలూరు: పశువులకు వేస్తున్న గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్టు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఆవులు, జీవాలకు టీకాలు వేసి పాడి రైతులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కాగా రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భావన కార్యక్రమ వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. టీకా కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.